సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం । 12 । ఆగస్టు । 2025



కిక్కుకు.. పర్మిట్ !

పర్మిట్ రూముల ఏర్పాటుకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపేందుకు సిద్ధమవుతోంది. బార్ అండ్ రెస్టారెంట్ అనుమతి పునరుద్ధరణ ప్రక్రియ జరుగుతోంది - 8లో



ఒక్క మాత్రతో 'నులి'మేద్దాం

కంటికి కనిపించని శత్రువు. ఒంటికి హాని కలిగించేదే నులిపురుగు. ఇది మనిషి పేగుల్లో మకాం వేసి రక్తాన్ని పీల్చి పిల్లలను పిప్పి చేస్తూ రక్తహీనతను కలిగిస్తుంది. - 8లో

గరిష్టం/కనిష్టం
31.6 /24.0

వాతావరణం

జిల్లాలో సోమవారం 24.0 – 31.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్.

పచ్చస్వామ్యం!

- అడుగడుగునా కోడ్ ఉల్లంఘిస్తున్న కూటమి నేతలు
- ఆయా పల్లెల్లో తిష్ట వేసిన ఎమ్మెల్యేలు
- విజయం కోసం ఎన్నో అడ్డదారులు
- అడ్డుకోవాల్సింది పోయి.. సహకరిస్తున్న అధికారులు
- ఓటర్ల పోలింగ్ కేంద్రాల మార్పు

సాక్షి ప్రతినిధి, కడప : పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం అపహాస్యమైంది. అధికార దర్పంతో.. అధికారుల సాయంతో కూటమి నేతలు చేసిన అరాచకాలకు ప్రజాస్వామ్యం కాస్త 'పచ్చ'స్వామ్యంగా మారిపోయింది.

పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో గెలుపు కోసం తెలుగుదేశం పార్టీ అనేక అడ్డదారులు ఎంచుకుంది. నాయకులపై భౌతిక దాడులు నుంచి ఓటర్లు ప్రలోభాలు పెట్టేంత వరకూ అనేక సందర్భాలల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడింది. టీడీపీ నేతలకు అధికారులు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. సోమవారం కూడా పులివెందుల పల్లెల్లో ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, పుత్తా కృష్ణచైతన్య రెడ్డి, టీడీపీ నేత భూపేష్‌రెడ్డి యథేచ్ఛగా తిరిగారు. ఎలాగైనా టీడీపీ అభ్యర్థిని గెలిపించుకోవాలని చేయని ప్రయత్నమంటూ లేదు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తే వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తుమ్మల హేమంత్‌రెడ్డి విజయం సాధిస్తారనే నమ్మకం టీడీపీ నేతలకు కూడా ఉండడంతోనే దుశ్చర్యలకు దిగినట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.



డీఐజీని కలిసిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, పోలింగ్ సజావుగా నిర్వహించాలని కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌కుమార్‌ను కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పులివెందులలో కలిశారు. డీఎస్పీ కార్యాలయంలో ఉన్న డీఐజీ వద్దకెళ్లి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని కోరారు. 'ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, కృష్ణచైతన్యరెడ్డి గ్రామాల్లో యథేచ్ఛగా తిరుగుతున్నారు. మరోవైపు వైఎస్సార్‌సీపీ కేడర్‌ను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. కట్టడి చేసే ప్రయత్నం కన్పించడం లేదు. జెడ్పీటీసీ ఉప ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా పోలింగ్ నిర్వహించలేని పరిస్థితి ఉండడం దౌర్భాగ్య'మని ఎంపీ చెప్పుకొచ్చినట్లు సమాచారం. 'బీఎల్‌ఓలు పంపిణీ చేసిన ఓటర్లు స్లిప్‌లు కూడా టీడీపీ నేతలు బలవంతంగా తీసుకుంటున్నారు. చాలా మంది ఓటు హక్కును కూడా కోల్పోయే ప్రమాదం ఉందని' వివరించినట్లు సమాచారం. వాస్తవంగా క్షేత్రస్థాయిలో అడుగడుగునా కోడ్ ఉల్లంఘణలు జరుగుతున్నా అధికారులు కట్టడి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఓవైపు ఎస్పీ పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తూ, డీఐజీ పులివెందులలోనే ఉంటూ సమీక్షిస్తున్నా కోడ్ ఉల్లంఘనులను కట్టడి చేయకపోవడం విచారకరమని పరిశీలకులు భావిస్తున్నారు.

హైకోర్టులో పోలీసులకు చుక్కెదురు

ఈనెల 5న సైదాపురం సురేష్‌కుమార్‌రెడ్డి, అమరేష్ రెడ్డిపైన, 6వ తేది ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, వేల్పుల రామలింగారెడ్డిపై హత్యాయత్నం ఘటనలు ఉత్పన్నమయ్యాయి. ఈనేపథ్యంలో 6వతేది సాయంత్రం భాకరాపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి పులివెందుల అర్బన్ పోలీసుస్టేషన్ వరకూ శాంతి ర్యాలీ నిర్వహించారు. వుయ్ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేస్తూ శాంతి ర్యాలీ కొనసాగింది. తర్వాత పోలీసు అధికారులకు మెమెరాండం ఇచ్చారు. ర్యాలీ నేపథ్యంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితోపాటు 150మందిపై ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని కేసు నమోదు చేశారు. ఈకేసును సవాల్ చేస్తూ వైఎస్సార్‌సీపీ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో పులివెందుల పోలీసులకు చుక్కెదురైంది. తదుపరి చర్యలు, అరెస్టులు చేయరాదంటూ సోమవారం స్టేటస్‌కో ఉత్తర్వులు జారీ చేసింది.

ఆలోచించండి.. విజ్ఞతతో తీర్పు ఇవ్వండి!

సాక్షి ప్రతినిధి, కడప : పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల వేళ ఆసక్తికర పరిణామం వెలుగుచూసింది. మేధావుల ఫోరం, పులివెందుల పేరిట 'ఆలోచించండి.. విజ్ఞతతో తీర్పు ఇవ్వండి'.. అంటూ ఓ బహిరంగ లేఖ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అసలు టీడీపీకి ఓటెందుకు వేయాలి? అని ప్రశ్నించడంతో పాటు.. వైఎస్సార్, వైఎస్ జగన్ హయాంలో జరిగిన అనేక అభివృద్ధి అంశాలను అందులో ప్రస్తావించడం తీవ్ర చర్చనీయాంశమైంది. లేఖ పూర్తిపాఠం ఇలా ఉంది..



- పులివెందుల ప్రజలు తెలుగుదేశం పార్టీకి ఎందుకు ఓట్లు వేయాలి? ఏం చేశారు? ఏం చూసి ఓట్లు వేయాలి? కసనూరు సంస్కృతి (ఫ్యాక్షన్ తరహా రాజకీయాలు) తెరపైకి తెచ్చి భయానక పరిస్థితులు కల్పించినందుకా? .. ప్రశాంత పట్టణంలో విచ్చలవిడి దౌర్జన్యం చేస్తున్నందుకు ఓటెయ్యాలా?.. కోనసీమను మరిపించేలా పంట పొలాలు, ఆహ్లాదకర వాతావరణంతో ఉన్న పచ్చటి గ్రామాల్లో రక్తపాతం పారిస్తున్నందుకు ఓటెయ్యాలా?.. ఓ సారి ఆలోచించండి. కామధేనువు లాంటి వైఎస్ కుటుంబాన్ని కాదని పక్కవారిని ఎందుకు బలపర్చాలి? పులివెందుల మండల ప్రజలు ఒకసారి ఆత్మావలోకనం చేసుకోవాలి. అభివృద్ధికి వైఎస్ కుటుంబం చిరునామా. ఎన్నో ఏళ్లు అధికారంలో ఉన్నామని చెప్పుకునేందుకు మాత్రమే చంద్రబాబు, తెలుగుదేశం పార్టీ పరిమితం. నిర్దిష్టమైన అభివృద్ధి చేశామని చెప్పుకునేందుకు ఒక్కటంటే ఒక్కటీ లేదు. పులివెందుల అభివృద్ధంటూ జరిగిందంటే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మాత్రమే. ఈ విషయం మీకు తెలియంది కాదు. కళ్లెదుట కన్పిస్తోంది. ఉదాహరణకు..
- విద్యాపరంగా జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, నాడు-నేడు పథకంలో అపురూపంగా మారిన పాఠశాలలు.
- ఆరోగ్య రంగంలో డాక్టర్ వైఎస్సార్ మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, ఉపాధి రంగంలో యూసీఐఎల్, ఆదిత్య బిర్లా ఫ్యాషన్స్, గోవింద రాజా టెక్స్‌టైల్స్, వ్యవసాయ రంగంలో చీనీ మార్కెట్ యార్డు, బనానా రీసెర్చ్ సెంటర్, ఐజీసీఏఆర్‌ఎల్ (ఐజీ కార్ల్), డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ గుర్తుకొస్తాయి. ఒక ప్రాంతంలో ఇన్ని సంస్థలు రావడం సాధ్యమా? వైఎస్ కుటుంబం చలువే కదా ఇదంతా.
- కృష్ణా జలాలను మెట్ట ప్రాంతంలో పారించాలనే తపన డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిది. అందుకే గండికోట రిజర్వాయర్ నుంచి నీరు లిఫ్ట్ చేసి, పైడిపాలెం రిజర్వాయర్‌లో నిల్వచేసే బృహత్తర ప్రాజెక్టు తీసుకొచ్చారు.
- మూడు టీఎంసీలకు మాత్రమే పరిమితమైన చిత్రావతి ప్రాజెక్టును 10 టీఎంసీలకు విస్తరించారు. గండికోట నుంచి చిత్రావతి లిఫ్ట్ ద్వారా నీరు తీసుకొచ్చారు. కుడి, ఎడమ కాలువలు తవ్వారు.
- అద్భుతమైన రోడ్డు కనెక్టవిటీ సౌకర్యం కల్పించారు. బెంగళూరు-విజయవాడ ఎక్స్‌ప్రెస్ హైవే, ఔటర్ రింగ్ రోడ్డు, విలేజ్ కనెక్టివిటీ రోడ్లు, సచివాలయాలు, వరల్డ్ క్లాస్ ఆర్టీసీ బస్టాండ్, క్రికెట్ స్టేడియం, మినీ సెక్రటేరియట్ ఉలిమెల్ల లేక్‌వ్యూ, రాణి తోపుల ఇవన్నీ వైఎస్ కుటుంబం తీసుకొచ్చినవే కదా!

టీడీపీ గెలుపు ఎవరికి ప్రయోజనం..?

ఇక పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఎవరికి ప్రయోజనం? ప్రధానంగా బీటెక్ రవికి, పరోక్షంగా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి. ఇది జగమెరిగిన సత్యం. అందుకే ఇద్దరూ కలిసి కుట్రలు, కుతంత్రాలకు దిగుతున్నారు. విచ్చలవిడిగా దౌర్జన్యాలు చేస్తున్నారు. పోలింగ్‌లో దొమ్మి చేయాలని చూస్తున్నారు. పోనీ, ఆ తర్వాత కూడా ఇలాగే ఉంటారా? 2019లో అధికారంలోకి వైఎస్సార్‌సీపీ రాగానే రూ.10 కోట్లు ఇస్తాం, పార్టీలో చేర్చుకోండంటూ పాదాక్రాంతమయ్యారు. ఇదంతా వాస్తవమే కదా!

జగన్‌ను ఓడించామని చెప్పుకునేందుకే..

పులివెందులలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించామని చెప్పుకునేందుకే.. నానా తంటాలు పడుతున్నారు. కట్టడి చేయాల్సిన వ్యవస్థలు మిన్నకుండిపోయాయి. టీడీపీ పెద్దలు చంద్రబాబు, లోకేశ్ మెప్పు కోసమే ఈ యాగీ అంతా. నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ) 2024–25 విద్యా సంవత్సరంలోనే పులివెందులకు 50 ఎంబీబీఎస్ సీట్లు మంజూరు చేసింది. నిర్దయగా వద్దని చంద్రబాబు సర్కారు లేఖ రాసింది. జీఎన్‌ఎస్‌ఎస్ నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అనుసంధానం ప్రాజెక్టును మరుగునపర్చారు. ఎలాంటి పురోగతిలేదు. తెలుగుదేశం పార్టీకి ఎందుకు ఓట్లు వేయాలి? ఆలోచించండి.. విజ్ఞత ప్రదర్శించండి. నిర్భయంగా మీ ఓటు హక్కును మీరే వినియోగించుకోండి. పులివెందుల పౌరుషాన్ని తెలియజేయండి.

– మేధావుల ఫోరం, పులివెందుల

పోలింగ్‌కు సర్వం సిద్ధం



పులివెందుల ఆర్డీఓ కార్యాలయం వద్ద ఎన్నికల సామగ్రిని చూసుకుంటున్న సిబ్బంది



సామగ్రితో ఒంటిమిట్ట మండలానికి బయలుదేరిన పోలింగ్ సిబ్బంది



ఓటింగ్ సమయం : ఉదయం 7 నుంచి 5 గంటల వరకు

జెడ్పీటీసీ స్థానం..	పోలింగ్ కేంద్రాలు	ఓటర్లు
పులివెందుల	15	10,601
ఒంటిమిట్ట	30	24,606

పోటీలో ఉన్న అభ్యర్థులు వీరే



పులివెందుల

తుమ్మల హేమంత్ రెడ్డి (వైఎస్సార్ సీపీ), మారెడ్డి లతారెడ్డి (టీడీపీ), మొయిళ్ల శివ కల్యాణ్‌రెడ్డి (కాంగ్రెస్), అంకిరెడ్డి సురేష్ కుమార్‌రెడ్డి, తుమ్మలూరు అనిల్‌కుమార్‌రెడ్డి, నాగేళ్ల సాంబశివారెడ్డి, భూమిరెడ్డి రవీంద్రారెడ్డి, ఎం.గజేంద్రనాథ్‌రెడ్డి, మారెడ్డి జయభారత్‌రెడ్డి, ఎం.వెంగళరెడ్డి, యాదాటి సునీల్ యాదవ్ (స్వతంత్రులు)లు రంగంలో ఉన్నారు.

ఒంటిమిట్ట

ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి (వైఎస్సార్ సీపీ), పూల విజయభాస్కర్ (కాంగ్రెస్), ముద్దుకృష్ణారెడ్డి (టీడీపీ), సౌమిత్రి చంద్రనాథ్, కోనేటి హరి వెంకట రమణ, గుండు మల్లికార్జున రెడ్డి, టక్కోలి శివారెడ్డి, నడివీధి సుధాకర్, వై.మధుమూర్తి, మామిళ్ల ఈశ్వరయ్య, వెంకటేష్ నంద్యాల (స్వతంత్రులు)లు పోటీలో ఉన్నారు.

కడప సెవెన్‌రోడ్స్ : పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాలకు మంగళవారం పోలింగ్ జరగనుంది. కడప, పులివెందుల ఆర్డీఓ కార్యాలయాల వద్ద ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి బ్యాలెట్ బ్యాక్సులు, ఇతర పోలింగ్ సామగ్రితో సిబ్బంది తమకు కేటాయించిన కేంద్రాలకు తరలి వెళ్లారు. జీపీఎస్‌తో కూడిన బస్సుల్లో రూట్ ఆఫీసర్లు, పోలీసు అధికారులతో పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారు. పులివెందుల మండలంలో ఏర్పాటు చేసిన 15 పోలింగ్ కేంద్రాల్లో 10,601 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. అలాగే ఒంటిమిట్ట మండలంలో ఏర్పాటు చేసిన 30 పోలింగ్ కేంద్రాల్లో 24,606 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు వీలుగా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్‌తోపాటు మైక్రో అబ్జర్వర్లను నియమించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రూట్ మొబైల్స్, స్ట్రైకింగ్‌ఫోర్స్‌లను, మొబైల్ వీడియో కెమెరాలు, నేత్ర వాహనాలతో పాటు అత్యాధునిక డ్రోన్లను కూడా వినియోగిస్తుండడం విశేషం. పోలింగ్ ముగిసిన వెంటనే బ్యాలెట్‌బాక్సులను పటిష్ట బందోబస్తు మధ్య కడప నగర శివార్లలోని మను పాలిటెక్నిక్ కళాశాల స్ట్రాంగ్ రూముకు తరలించనున్నారు. ఈనెల 14న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు.



న్యూస్‌రీల్

ఓటరు స్లిప్పు లేకున్నా గుర్తింపు కార్డుతో ఓటు

– పోలింగ్ జరిగే గ్రామాలకు బస్సులు, ఆటోలు
– కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్ : పులివెందుల, ఒంటిమిట్ట మండలాల్లో మంగళవారం జరగనున్న పోలింగ్‌లో ఓటర్లంతా నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. బ్యాలెట్‌బాక్సుల ద్వారా పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ మెటీరియల్ ఆయా పోలింగ్ కేంద్రాలకు పంపామన్నారు. ఓటర్లకు పోలింగ్ కేంద్రాల వివరాలతో కూడిన స్లిప్పులను పంపిణీ చేశామన్నారు. ఒకవేళ ఎవరికైనా ఓటరుస్లిప్పులు లేకపోతే గుర్తింపు కార్డుతో వెళ్లి వివరాలు తెలియజేసి ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ జరిగే అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సులు, ఆటోలు అందుబాటులో ఉంచామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద నలుగురు సిబ్బందితో హెల్ప్‌డెస్క్ ఉంటుందన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఎవరైనా అనవసరమైన రెచ్చగొట్టే వదంతులు ప్రసారం చేసినా స్పందించకుండా ఓటర్లు ప్రశాంతంగా ఓటు వేయాలన్నారు. సాయంత్రం 5.00 గంటల నాటికి క్యూ లైన్‌లో నిలుచున్న వారందరితో ఓటు వేయిస్తారన్నారు.

మైలవరం నుంచి నీరు విడుదల

జమ్మలమడుగు : మైలవలరం జలాశయం నుంచి పెన్నానదికి నీటిని విడుదల చేసినట్లుఈఈ రమేష్ పేర్కొన్నారు. గండికోట జలాశయం నుంచి ఐదువేల క్యూసెక్కుల నీరు మైలవరం జలాశయంలోనికి వస్తున్నాయని దీంతో ఈ నీటిని దిగువనున్న పెన్నానదిలోనికి విడుదల చేస్తున్నామన్నారు. సోమవారం ఉదయం 1500 క్యూసెక్కులు మధ్యాహ్నం 3000 క్యూసెక్కులు సాయంత్రానికి ఐదువేల క్యూసెక్కుల నీరు జలాశయంనుంచి దిగువకుపోతుందన్నారు. పెన్నానది పరివాహక ప్రాంతాల ప్రజలు నదిలోకి వెళ్లకుండా జాగ్రత్తలు చేసుకోవాలని పంచాయతీ, మున్సిపల్, పోలీసు అధికారులకు సందేశాలు జారీ చేశామని పేర్కొన్నారు.

సీఎంఓ డైరెక్షన్‌లో పులివెందుల ఎన్నిక



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

- దౌర్జన్యాలు, రిగ్గింగ్‌తో గెలిచేందుకు యత్నాలు
- స్లిప్పులు ఓటర్లకు కాకుండా టీడీపీ వారికి పంపిణీ
- బయట వ్యక్తులతో ఓట్లు వేయించుకునేందుకు కుట్రలు
- ప్రజాస్వామ్య వాదులు ఖండించాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : ముఖ్యమంత్రి కార్యాలయ డైరెక్షన్‌లోనే పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలు జరుగుతున్నాయని, అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు, రిగ్గింగ్‌లతో గెలవాలని టీడీపీ యత్నిస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఆరోపించారు. సీఎంఓ డైరెక్షన్‌లో ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి పనిచేస్తున్నారన్నారు. సోమవారం సాయంత్రం కడపలోని తమ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేవలం 10,601 ఓట్లు ఉన్న పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ నుంచి అధికారులకు ఆదేశాలు వచ్చాయన్నారు. ఓవైపు ఎన్నికలు జరుగుతుంటే, ఎస్పీ ఎర్రచందనంపై ప్రెస్‌మీట్ నిర్వహించడం, డీఐజీ పత్తి వ్యాపారం చేయడం ఇందుకు నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి నల్లపురెడ్డిపల్లె గ్రామంలో, ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి ఎర్రబల్లి గ్రామంలో తిష్టవేసి చీరలు పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. జమ్మలమడుగు, కమలాపురం నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున ఇప్పటికే మనుషులను తరలించారన్నారు. స్లిప్పులు ఓటర్లకు పంపిణీ చేయకుండా అధికారులు టీడీపీ వారికి ఇస్తున్నారని విమర్శించారు. ఆ స్లిప్పులు తీసుకుని బయటి నుంచి వచ్చిన వ్యక్తులు ఓట్లు వేయనున్నారని ఆరోపణలు చేశారు. ఇందుకు అభ్యంతరం చెప్పే ఏజెంట్లను లేకుండా చేశారన్నారు. మగవాళ్లందరికీ బైండోవర్ కేసులు బనాయించారని, రైతులను తోటల వద్దకు కూడా వెళ్లనీయడం లేదన్నారు. అధికార పార్టీ కనుసన్నల్లో పనిచేసే డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలను ఎన్నికల విధులకు వినియోగిస్తున్నారని ఆరోపించారు. ఇలా నాలుగు వేల ఓట్లు రిగ్గింగ్ చేసేందుకు ప్రణాళిక రూపొందించారన్నారు. ఎన్నికల్లో గెలిచేందుకు రూ. 100 కోట్లు అధికార పార్టీ ఖర్చుచేసేందుకు సిద్ధమైందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయడం ద్వారా ఓటర్ల మనస్సు గెలుచుకుని ఎన్నికల్లో గెలవాల్సింది పోయి విచ్చలవిడి దౌర్జన్యకాండకు దిగడం అప్రజాస్వామికమని ధ్వజమెత్తారు. పులివెందులలో గెలిచామని చెప్పుకునేందుకు ఇదంతా చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఎప్పుడూ ఈ తరహా ఎన్నికల్లో అక్రమాలు జరగలేదన్నారు. తాము కూడా ఇలా అనుకుని ఉంటే టీడీపీ వారు తిరిగే వారా? అని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, భారతీరెడ్డి వాట్సాప్ కాల్స్ ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారంటూ టీడీపీ నేతలు దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ఇలాంటి ఎన్నికలు పోలీసు వ్యవస్థకు కూడా సిగ్గుచేటన్నారు. ప్రజాస్వామ్య వాదులంతా ఇలాంటి అప్రజాస్వామిక చర్యలను ఖండించాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, నాయకులు పులి సునీల్‌కుమార్, నిరంజన్‌రెడ్డి, షఫీ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు

- పులివెందుల పోలింగ్ కేంద్రాల్లో ఇతర నియోజకవర్గాల కార్యకర్తలు తిష్ట
- ఒక్కో బూత్‌కు ఒక్కో టీడీపీ ఎమ్మెల్యే నియామకం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : పోలీసులు – టీడీపీ నేతలు కలిసి పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని మానభంగం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి వ్యాఖ్యానించారు. టీడీపీ నేతల దౌర్జన్యాన్ని ఎదిరించి ఆయా గ్రామాల ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. సోమవారం ప్రొద్దుటూరులోని తన స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో ఓటర్లను ఓటు వేయనీయకుండా.. దౌర్జన్యం చేసి పోలింగ్ ప్రారంభంలోనే వారు ఓటు వేసేకునేందుకు వ్యూహాన్ని రచించారన్నారు. తొలి నుంచి పులివెందుల ప్రాంత వాసులను రౌడీలుగా, గుండాలుగా, రాక్షసులుగా, ఆటవికులుగా చూపి మాట్లాడిన టీడీపీ నేతలు ఈ రోజు ఓట్ల కోసం మీ వద్దకు వచ్చారన్నారు. పులివెందులకు మెడికల్ కాలేజీని జగన్ ప్రభుత్వంలో మంజూరు చేస్తే ఆ కాలేజీలో సీట్లు ఇవ్వకుండా టీడీపీ ప్రభుత్వం నిలిపేసిందని గుర్తు చేశారు. పులివెందుల ప్రాంతానికి సంబంధించి నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి హయాం నుంచి జగన్‌మోహన్‌రెడ్డి వరకు ఎన్నో అభివృద్ధి పనులు చేశారన్నారు. ప్రజల చేతికి ఓటు ఇస్తే ఓడిపోతామనే భయంతో టీడీపీ నేతలే జిల్లాలోని ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కడపతోపాటు ఇతర నియోజకవర్గాల నుంచి కార్యకర్తలను, అనుచరులను పిలిపించి గ్రామాల్లో తిష్ట వేయించారన్నారు. ఉదయం పోలింగ్ ప్రారంభంకంటే ముందుగానే వారు గొడవలు సృష్టించే అవకాశం ఉందన్నారు. ఇందు కోసం ఒక్కో పోలింగ్ బూత్‌కు ఒక్కో నియోజకవర్గ ఎమ్మెల్యేలను టీడీపీ నియమించిందని ఆరోపించారు. ఈ విషయాన్ని గమనించి ఓటర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. జగనన్న నాయకత్వంలో వైఎస్ కుటుంబాన్ని ప్రేమించే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే వాదులందరూ మంగళవారం ఉదయం 6 గంటలకే పులివెందులలోని జగన్ ఇంటి వద్దకు చేరుకోవాలని, ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే అక్కడి పోలింగ్ స్టేషన్ల వద్దకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. లాఠీ చార్జీలకు, టీడీపీ నేతల దౌర్జన్యాలకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. పార్టీ శ్రేణులంతా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వెంట ఉంటూ సంఘటితంగా ఉండాలని కోరారు.

చెక్ పోస్టుల వద్ద ప్రత్యేక కోడ్

ఎన్నికల ప్రచారం ముగిసిన వెంటనే ఇతర నియోజకవర్గాలకు చెందిన పార్టీ నాయకులందరిని పోలీసులు ఇళ్లకు పంపారని రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం నుంచే టీడీపీ నాయకులు, గుండాలు పులివెందులకు మళ్లీ చేరుకున్నారని, ఇందుకోసం చెక్ పోస్టుల వద్ద ప్రత్యేక కోడ్‌ను పోలీసులకు ఇచ్చిందన్నారు. పోలీసులు పూర్తిగా టీడీపీ తొత్తులుగా పనిచేస్తున్నారని విమర్శించారు. కోడ్ చూపించిన వారికి గ్రామాల్లోకి ప్రవేశం కల్పిస్తున్నారన్నారు. ముందుగానే గ్రామాల్లోకి చేరిన టీడీపీ నేతలు ఓటర్ల నుంచి స్లిప్‌లను సేకరించారన్నారు. మంగళవారం పోలింగ్ ప్రారంభమైన పోలింగ్ బూత్‌లో దొంగ ఓట్లు వేసుకుంటే అడ్డుకోబోయే వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై దాడి చేసి దౌర్జన్యంగా ఓట్లు వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి, పట్టణాధ్యక్షుడు, కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లాలో కొనసాగుతున్న వర్షాలు

కడప అగ్రికల్చర్ : అల్పపీడనం కారణంగా జిల్లాలో ఐదు రోజుల నుంచి వర్షాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం తెల్లవారుజాము జిల్లాలోని మైదుకూరులో అత్యధికంగా 72.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అలాగే పులివెందుల్లో 59, ప్రొద్దుటూరులో 51.6, కమలాపురంలో 47.6, చాపాడులో 44.8, వల్లూరులో 43.2, సింహాద్రిపురంలో 42.4, తొండూరు, మైలవరంలో 32.4, కడపలో 24.8, జమ్మలమడుగులో 22, ఖాజీపేటలో 16.8, దువ్వూరులో 15, వీఎన్‌పల్లి 14.4, లింగాలలో 13.2, ఎర్రగుంట్లలో 13, ముద్దనూరులో 12.8, పెద్దముడియంలో 10.4, అట్లూరులో 8.4, వేముల, వేంపల్లి, రాజుపాలెంలలో 6.8, కొండాపురంలో 6.4, బి.మఠంలో 5.2, చక్రాయపేటలో 4.2, చెన్నూరులో 1.8, బద్వేల్‌లో 0.4 మి.మీ వర్షం కురిసింది.

జావెలిన్ త్రో స్టేట్ ఫస్ట్ సూఫియాన్

కమలాపురం : కమలాపురం దర్గా వీధికి చెందిన ఎస్. సూఫియాన్ కిడ్స్ జావెలిన్ త్రో విభాగంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. కడపలోని డా. వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న సూఫియాన్ బాపట్ల జిల్లా చీరాలలో ఈ నెల 9 నుంచి 11 వ తేదీ వరకు జరిగిన 36వ ఏపీ స్టేట్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్–14 కిడ్స్ జావెలిన్ త్రో విభాగంలో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచాడు. నిర్వాహకుల చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నాడు. కాగా స్పోర్ట్స్ స్కూల్ నుంచి రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన సూఫియాన్‌ను, అథ్లెటిక్స్ స్పోర్ట్స్ కోచ్ వెంకటేశ్వర్లును ప్రిన్సిపల్ జగన్‌మోహన్ రెడ్డి అభినందించారు.



జావెలిన్‌త్రోలో ప్రథమ స్థానంలో నిలిచిన సూఫియాన్

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


ప్రశాంత్ (ఫైల్)

కొండాపురం : మండల పరిధిలోని వెంకయ్యకాలువ గ్రామానికి చెందిన తుడిమెల ప్రశాంత్ (22) సోమవారం విష ద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ తెలిపారు. ఈ యువకుడు బాల్యం నుంచి చక్కెర వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతూ ఉండేవాడు. చిన్న వయస్సులోనే చక్కెర వ్యాధి వచ్చిందని మనస్తాపం చెంది శనివారం విష ద్రావణం తాగాడు. కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తండ్రి విశ్వనాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

చియ్యపాడులో కూలిన చౌడు మిద్దె


కూలిన చౌడుమిద్దె పైకప్పు

చాపాడు : మండల పరిధిలోని చియ్యపాడు గ్రామంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వీఆర్‌ఏ (గ్రామ సేవకుడు)గా పని చేస్తున్న మండ్ల సిద్దయ్యకు చెందిన చౌడు మిద్దె కూలిపోయింది. గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో సోమవారం ఉదయం అందరూ చూస్తుండగా సిద్దయ్యకు చెందిన చౌడు మిద్దె పై కప్పు కూలిపోయింది. రెండు రోజుల క్రితమే సిద్దయ్య బంధువుల ఇంటికి వెళ్లడంతో మిద్దె కూలిన సమయంలో ప్రమాదం నుంచి తప్పించుకున్నట్లు అయింది. మిద్దె కూలి పోవడంతో తాను కొత్త ఇంటిని నిర్మించుకునేందుకు ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

కుక్క అడ్డు రావడంతో..


గాయపడిన బొమ్ము రామమోహన్‌రెడ్డి

బ్రహ్మంగారిమఠం : బి.మఠంలోని గురుకుల పాఠశాల వద్ద సోమవారం సాయంత్రం సోమిరెడ్డిపల్లెకు చెందిన బొమ్ము రామమోహన్‌రెడ్డి అనే వ్యక్తికి రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. రామమోహన్‌రెడ్డి బి.మఠం నుంచి మైదుకూరుకు బైకుపై వెళ్తుండగా గురుకుల పాఠశాల సమీపంలో కుక్క అడ్డంగా వచ్చింది. దీంతో బైక్ కుక్కకు తగిలి కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

టీటీడీకి రూ.10 లక్షలు విరాళం

తిరుమల : వైఎస్సార్ జిల్లాకు చెందిన సీఆర్ అసోసియేట్స్ సంస్థ అధినేత చరణ్ తేజ్ టీటీడీ ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు సోమవారం రూ.10,10,116 విరాళంగా అందించారు. ఈమేరకు దాత తిరుమలలోని టీటీడీ అదనపు కార్యాలయంలో అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరికి విరాళం డీడీ అందజేశారు.

ఒక్క మాత్రతో ‘నులి’మేద్దాం

- నేడు జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం
- ఒంటిమిట్ట, పులివెందుల మినహా అన్ని మండలాల్లో మాత్రలు పంపిణీ
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యా, వైద్య ఆరోగ్యశాఖలు
- నేడు వల్లూరు మోడల్ స్కూల్‌లో జిల్లా కార్యక్రమం



నులిపురుగుల నిర్మూలనకు సంబంధించిన పోస్టర్

కడప ఎడ్యుకేషన్ : కంటికి కనిపించని శత్రువు. ఒంటికి హాని కలిగించేదే నులిపురుగు. ఇది మనిషి పేగుల్లో మకాం వేసి రక్తాన్ని పీల్చి పిల్లలను పిప్పి చేస్తూ రక్తహీనతను కలిగిస్తుంది. నులి పురుగులు అధిక శాతం అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయి. దీని నివారణకు జిల్లా వ్యాప్తంగా ఈనెల 12వతేదీ మంగళవారం అన్ని అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్, ఐటీఐలలో విద్యనభ్యసిస్తున్న పిల్లలందరికి ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నారు. ఇందుకోసం వైద్యశాఖాధికారులు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఇందుకు సంబంధించిన మాత్రలను ఇప్పటికే అంగన్‌వాడీలు, స్కూల్స్, కళాశాలలకు తరలించారు. ఈ మేరకు జిల్లా స్థాయి కార్యక్రమాన్ని వల్లూరు మోడల్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి స్టేట్ ఎస్‌డీడీ మానిటరింగ్ ఆఫీసర్, జెడ్‌ఎంఓ జమాల్ బాషా, డీఎంఅండ్‌హెచ్‌ఓ నాగరాజు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమేష్ హాజరుకానున్నారు. ఏడాది వయసు నుంచి 19 ఏళ్ల వయసు ఉన్న పిల్లలందరికి ఈ నులిపురుగులను నివారించే మాత్రలను వేయనున్నారు.

వ్యాప్తి ఇలా..

- నులి పురుగులు కలుషిత ఆహారం, దుమ్ము ధూళి, ఈగలు వాలిన తినుబండారాలు తినటం వలన వ్యాపిస్తుంది.
- బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన ద్వారా, కాళ్లకు చెప్పులు లేకుండా మరుగుదొడ్డికి వెళ్లడం ద్వారా కూడా వచ్చే అవకాశం ఉంది.
- ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు, వంట సరుకులు, శుభ్రమైన నీటితో కడగకపోవడం వలన వస్తుంది.
- భోజనం వండేవారు, వడ్డించేవారు, తినేముందు తిన్న తరువాత చేతులు శుభ్రంగా కడక్కోకపోవడం వల్ల వస్తుంది.
- చేతివేళ్లకు గోర్లు ఉండటం వల్ల కూడా వచ్చే అవకాశం ఉంది.
- ఆరుబయట తిరిగేటప్పుడు బూట్లు, చెప్పులు ధరించకపోవడం వల్ల వస్తుంది.

బాల్యం చిక్కిపోతోంది..

జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలు 4,71,835 మంది ఉన్నారు. ఇందులో 1 నుంచి 2 సంవత్సరాల పిల్లలకు (అంగన్‌వాడీ కేంద్రంలోని) ఆల్‌బెండజోల్ 200 ఎంజీ, 3 నుంచి 19 సంవత్సరాలలోపు వారికి 400 ఎంజీ మాత్రలు మధ్యాహ్నం భోజనం తరువాత నీళ్లలో మింగించాలి. భోజనం చేయకుండా మాత్రను వేసుకుంటే కడుపునొప్పి, వాంతులు అయ్యే అవకాశం ఉంది. విద్యార్థులకు జ్వరం లేదా ఇతర ఇతర కారణాల వలన అనారోగ్యంగా ఉన్నప్పుడు వారికి ఆల్‌బెండజోల్ 400 గ్రాముల మాత్రలు ఇవ్వకూడదు.

ఆ రెండు మండలాలు మినహా..

జిల్లాలో ఒంటిమిట్ట, పులివెందుల మండలాలలో జెడ్పీటీసీ ఉప ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమలులో ఉంది. దీంతో ఈ రెండు మండలాల్లో నులిపురుగుల నివారణ మందులు వేయడం లేదు. ఇక్కడ ఈనెల 20వ తేదీ నులి పురుగుల నివారణ మందులను వేయనున్నారు.

ఉపాధ్యాయులు పాటించాల్సిన నియమాలు..

- ఈ నులి పురుగుల కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఆరోగ్యశాఖ అధికారులు స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించాలి.
- ప్రార్థన సమయంలో ఆల్‌బెండోజోల్ 400 గ్రాముల మాత్రల ఆవశ్యకతతోపాటు చేతుల పరిశుభ్రత గురించి వివరించాలి. అందేలా చూడాలి

నులిపురుగుల నిర్మూలన వల్ల ప్రయోజనాలు..

- పిల్లల్లో రక్తహీనత నియంత్రిస్తుంది.
- పోషకాహార ఉపయోగతను మెరుగు పరుస్తుంది
- వ్యాధి నిరోధకతను మెరుగు పరుస్తుంది
- ఏకాగ్రత, నేర్చుకోగల సామర్థ్యం, పాఠశాల మరియు అంగన్‌వాడీ కేంద్రానికి హాజరు మెరుగుపరుస్తుంది

ప్రతి పాఠశాలలో ఇవ్వాలి



జిల్లా వ్యాప్తంగా ఒంటిమిట్ట, పులివెందుల మండలాలు మినహా అన్ని పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులందరూ విద్యార్థులకు ఆల్‌బెండోజల్ 400 గ్రాముల మాత్రలను ఇవ్వాలి. ఈ విషయంలో వైద్యశాఖ, విద్యాశాఖ సమన్వయంతో పిల్లలకు మాత్రలను పంపిణీ చేయాలి. అన్ని జాగ్రత్తలను పాటిస్తూ పిల్లలతో మాత్రలను మింగించాలి. ఏదైనా తేడా అనిపిస్తే తక్షణం వైద్యుల దృష్టికి తీసుకెళ్లాలి.

– షేక్ షంషుద్దీన్, జిల్లా విద్యాశాఖాధికారి

చిన్నారుల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం..



పిల్లల్లో నులి పురుగుల నివారణ లక్ష్యంగా వారి ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం మంచి కార్యక్రమం చేపట్టింది. ఈ పురుగుల నివారణకు ఆల్‌బెండోజోల్ 400 ఎంజీ ఒక మాత్ర 2 ఏళ్లలోపు పిల్లలకు సగం మాత్రను నలిపి వేయాలి. 3 ఏళ్ల నుంచి 19 ఏళ్ల లోపు వారికి ఒక మాత్ర చొప్పున వేయాలి. ఏదేని కారణాలతో మాత్రలు వేసుకోని వారికి 20వ తేదీన మళ్లీ వేస్తాం. అప్పుడు తప్పకుండా వేసుకోవాలి.

– డాక్టర్ కె. నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

కదులుతున్న రైలు ఎక్కబోయి యువకుడి దుర్మరణం



జమ్మలమడుగు : కదులుతున్న రైలును ఎక్కబోయి ప్రమాదవశాత్తు కిందపడి ఓ యువకుడు(18) దుర్మరణం చెందాడు. ఆదివారం రాత్రి ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో ముంబై-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ రైలు కదులుతున్న సమయంలో అందులో ఎక్కబోయి ప్రమాదవశాత్తు రైలు కింద పడ్డాడు. తీవ్రంగా గాయాలు కావడంతో మృతి చెందినట్లు. కలమల్ల ఎస్‌ఐ సునీల్‌కుమార్ తెలిపారు. యువకుడి వివరాలు తెలియలేదన్నారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు వివరించారు.

ఉపాధి పనులను పరిశీలించిన కేంద్ర బృందం


ఉపాధి హామీ పథకం పనులను పరిశీలిస్తున్న కేంద్ర పరిశీలక బృందం సభ్యుడు దయానందరెడ్డి

అట్లూరు : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో పాటు కేంద్ర ప్రభుత్వం ద్వారా చేపట్టిన పనులను కేంద్ర పరిశీలక బృందం సభ్యుడు దయానందరెడ్డి పరిశీలించారు. తొలుత వరికుంట పంచాయతీలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జరిగిన తీరును ఆరా తీశారు. అలాగే తంబళ్లగొంది పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన 5 పనులను, ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీడీ ఆనంద్, ఏఓ భాస్కర్‌రావు, ఏపీఓ జయచంద్రబాబు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

విలేకరి బెదిరిస్తున్నాడని మహిళా సర్పంచ్ ఫిర్యాదు


నరసాపురం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐ రమణకు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ సుభద్రమ్మ

కాశినాయన : మండలంలోని కత్తెరగండ్ల గ్రామ పంచాయతీ సర్పంచ్ చెన్నుపల్లె సుభద్రమ్మ తనను మహబూబ్ బాషా అనే పత్రికా విలేకరి వేధిస్తున్నాడని సోమవారం నరసాపురం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐ రమణకు ఫిర్యాదు చేశారు. తాను విలేకరినని, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతికి పీఏను అని పాత పనులకు బిల్లు ఇవ్వాలని బెదిరిస్తున్నాడని సర్పంచ్ తెలిపారు. 2017–18 సంవత్సరంలో తాను గ్రామ పంచాయతీ కార్యాలయంలో మరుగుదొడ్డిని నిర్మించానని, అప్పుడు తనకు బిల్లులు రాలేదని, ఇప్పుడు బిల్లులు ఇవ్వాలని వేధిస్తున్నాడని పేర్కొన్నారు.

సర్పంచ్‌పై విలేకరి ఫిర్యాదు

రూ.50 లక్షలు గ్రామ పంచాయతీలో అవినీతి జరిగిందని పత్రికలో తాను వార్త రాసినందుకు సర్పంచ్, ఆమె బంధువులు తనను చంపుతామని బెదిరిస్తున్నారని నరసాపురం పోలీస్ స్టేషన్‌లో విలేకరి మహబూబాషా ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

కారు ఇస్తే కానిస్టేబుల్‌కు కుదువ పెట్టాడు!

కడప రూరల్ : స్నేహితుడే కదా అని కారు ఇచ్చాను...అతను తన కారును ఒక కానిస్టేబుల్‌కు కుదువ పెట్టుకున్నాడని బద్వేలు నియోజకవర్గం గోపవరానికి చెందిన సిద్దయ్య తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన బతుకుతెరువు కోసం 2023లో టయోటా కారును కొనుగోలు చేసి ఉపాధి పొందుతున్నట్లు తెలిపాడు. కొన్ని నెలల క్రితం బద్వేల్‌కు చెందిన తన మిత్రుడు వచ్చి ఒక వారం కారు కావాలని అడిగితే ఇచ్చానని పేర్కొన్నాడు. వారం దాటినా అతను తన కారును ఇవ్వకపోవడంతో విచారించగా తన మిత్రుడు కారును ఒక కానిస్టేబుల్‌కు కుదువ పెట్టినట్లు తెలిసిందన్నాడు. న్యాయం కోసం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయగా, బద్వేల్ పోలీస్ స్టేషన్‌కు రెఫర్ చేశారని తెలిపాడు. అయినా కూడా తనకు న్యాయం జరగలేదని ఆరోపించాడు. అధికారులు తనకు న్యాయం జరిగేలా చూడాలని కోరాడు.

బ్రహ్మంగారి హుండీల ఆదాయం రూ .28.22 లక్షలు


బ్రహ్మంగారిమఠంలో కానుకలను లెక్కిస్తున్న భక్తులు

బ్రహ్మంగారిమఠం : పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో భక్తులు సమర్పించుకున్న కానుకలను సోమవారం లెక్కించారు. రూ 28. 22 లక్షలు నగదు, 3 గ్రాముల బంగారు నగలు, 990 గ్రాముల వెండి వచ్చినట్లు మేనేజర్ ఈశ్వరాచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ, దేవదాయశాఖ అధికారి భారతి, పూర్వపు మఠాధిపతి కుటుంబ సభ్యులు, ఆంధ్రాబ్యాంక్ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లు రూ.16.40 లక్షలు

- అందులో రూ. 7 లక్షలు నగరపాలక సంస్థకు చెల్లింపు
- రూ. 4.20 లక్షలకు ఆధారాలు లభ్యం
- ఆరు బృందాలతో 2414 మందిని విచారణ
- మీడియాతో కడప నగర పాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థలో 2024 ఆగస్టు నెల నుంచి సుమారు రూ.16.40 లక్షలు యూజర్ చార్జీల పేరుతో అక్రమ వసూళ్లు చేసినట్టు తేలిందని కమిషనర్ మనోజ్ రెడ్డి వెల్లడించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రభుత్వం యూజర్ చార్జీలు వసూలు చేయవద్దని చెప్పినప్పటికీ వ్యాపార సంస్థల నుంచి క్లాప్ యూజర్ చార్జీలు వసూలు చేశారని వచ్చిన ఆరోపణలపై ఆరు ప్రత్యేక బృందాలతో పూర్తిస్థాయి విచారణ చేపట్టామన్నారు. ఇందులో భాగంగా 2414 మందిని విచారించగా 258 మంది తాము యూజర్ చార్జెస్ ఇచ్చామని చెబుతూ అందుకు సంబంధించిన రశీదులు, ఆధారాలు చూపారన్నారు. మిగిలిన 2156 మంది తాము ఎలాంటి యూజర్ చార్జీలు చెల్లించలేదని చెప్పారన్నారు. రూ.4,20,750లకు స్లిప్పులు తగిన ఆధారాలు ఉన్నాయని, రూ.12,19,500లకు ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ఇందులో 2024 ఆగస్టు నుంచి కార్పొరేషన్‌కు రూ.7 లక్షలు జమ అయిందన్నారు. తమ విచారణలో బయటపడిన నాలుగు లక్షల 20 వేల 750 రూపాయలు కూడా ఇందులో ఉన్నాయని తెలిపారు. దీనిపై ఇదివరకే ఎనిమిది మందిపై చర్యలు తీసుకున్నామని, ఇప్పుడు మరో ఏడుగురు శానిటరీ సెక్రటరీలు, ముగ్గురు ఆప్కాస్ సిబ్బందిపై చర్యలు తీసుకున్నామన్నారు. ఇంకా ఎవరి దగ్గరైనా ఆధారాలు ఉంటే తెలపాలని, వాటిపై కూడా విచారణ చేస్తామన్నారు. ఇకపై యూజర్ చార్జీలు వసూలు చేయకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

అనధికారికంగా లేఔట్‌లు వేసిన వారు, అందులో ప్లాట్లు కొన్నవారు 24వ తేదీలోపు ఆన్‌లైన్‌లో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ సూచించారు. 2025 జూన్ 30కి ముందు రిజిస్టర్ అయిన ప్లాట్ల యజమానులు ఈ స్కీమ్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. 45 రోజుల్లో మొత్తం ఫీజు చెల్లించిన వారికి 10 శాతం, 90 రోజుల్లో చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ ఉంటుందన్నారు. ఓపెన్ స్పేస్ చార్జీలు ఏడు శాతం చెల్లిస్తే సరిపోతుందన్నారు. కడప నగరంలో సుమారు వందకు పైగా అనధికారిక లేఔట్‌లు ఉన్నాయని, వీరంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కిక్కుకు.. పర్మిట్!

- మద్యం షాపులకు అనుగుణంగా పర్మిట్ రూములు
- నెలాఖరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేందుకు కసరత్తు
- అప్పటివరకు కూడా ఆగని మద్యం వ్యాపారులు
- ఇప్పటికే అనధికారికంగా ఏర్పాటు



కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : మద్యం షాపులకు అనుబంధంగా పర్మిట్ రూముల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం పచ్చ జెండా ఊపేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం బార్ అండ్ రెస్టారెంట్ అనుమతి పునరుద్ధరణ ప్రక్రియ జరుగుతోంది. దీనిని ఈ నెలాఖరుకు పూర్తి చేయడంపై ఎక్సైజ్ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే మద్యం షాపులకు అనుబంధంగా పర్మిట్ రూముల ఏర్పాటుకు మార్గదర్శకాలు వెలువడనున్నాయి. వాస్తవానికి మద్యం షాపులు ప్రారంభమైనప్పటి నుంచే వాటి యజమానులు చాలా చోట్ల గుట్టు చప్పుడు కాకుండా పర్మిట్ రూములు ఏర్పాటు చేసేశారు. ఇప్పుడు ప్రభుత్వమే దీనికి అనుమతులు ఇస్తుందన్న సమాచారంతో ఇంకా విచ్చల విడిగా పర్మిట్ రూములు తెరిచి పూర్తిగా తాగించేస్తున్నారు. గ్లాసులు, వెజ్, నాన్ వెజ్, స్నాక్స్ ఏర్పాటు చేసి మరీ విక్రయిస్తున్నారు. అర్ధరాత్రి వరకు తెరిచే ఉంచుతున్నారు. దీంతో మందుబాబులు అక్కడే తాగి తూలుతుండడంతో అటుగా వెళుతున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు

పర్మిట్‌కు రైట్ రైట్...

మద్యం ద్వారా వస్తున్న ఆదాయాన్ని మరింతగా పెంచుకునేందుకు కూటమి ప్రభుత్వం కొత్త మార్గాలు వెతుకుతోంది. ఇందులో భాగంగా మద్యం దుకాణం వద్దే పర్మిట్ రూములకు అనుమతి ఇవ్వాలని నిర్ణయించింది. ఈ విధానాన్ని పునః ప్రారంభించే దిశగా ఎక్సైజ్ శాఖ ఇప్పటికే కసరత్తు పూర్తి చేసింది. ఈ నెలాఖరులోపు పర్మిట్ రూములకు అనుమతులివ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు సైతం జారీ చేసింది. నూతన విధానంలో భాగంగా కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టింది. అప్పటి నుంచి జిల్లావ్యాప్తంగా మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 153 మద్యం షాపులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వీటికి అనుబంధంగా ఒక్కొక్కటిగా చొప్పున 153 సిట్టింగ్ రూములు ఏర్పాటు కానున్నాయి. కార్పొరేషన్, మున్సిపల్ పరిధిలో పర్మిట్ రూమ్‌కు రూ.7.50 లక్షలు ఇతర ప్రాంతంలో రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం ఫీజు ప్రకటించింది. సగటు చొప్పున ఒక్కో షాపునకు రూ.5 లక్షలు వసూలు చేసిన ప్రభుత్వానికి అదనంగా రూ.80 కోట్లు ఆదాయం సమకూరనుంది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అన్ని పర్మిట్ దుకాణాలకు ఏడాదికి రూ.5 లక్షలు పరిమిత ఫీజుగా ఉండేది. ఇప్పుడు దానిని రెండు కేటగిరీలుగా మారుస్తున్నారు.

ఆదాయమే లక్ష్యమా..

ఆదాయమే లక్ష్యంగా ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకు వచ్చింది. జిల్లా వ్యాప్తంగా 153 మద్యం షాపులకు గాను 3100 దరఖాస్తులు రాగా ఒక్కొక్కరి నుంచి రూ. 2 లక్షలు చొప్పున ప్రభుత్వం వసూలు చేసింది. తద్వారా రూ.62 కోట్లు ఆర్జించింది. షాపులు దక్కించుకున్న వ్యాపారులు ఆరు విడతల్లో లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. లైసెన్స్ ఫీజుల్లో 1/6 వంతు చెల్లించారు. పర్మిట్ రూములు సైతం అందుబాటులోకి వస్తే ఆదాయం మరింతగా పెరిగే అవకాశం ఉంటుంది. అయితే ప్రభుత్వమే ఆదాయం లక్ష్యంగా మద్యాన్ని ఏరులై పారిస్తోందని దీనివల్ల శాంతిభద్రతల సమస్యలు తలెత్తే ప్రమాదం పొంచి ఉంటుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే సమస్త సౌకర్యాలతో...

ఇప్పటికే ప్రతి షాపు వద్ద ఒక పర్మిట్ రూమును అనధికారికంగా తెరిచేశారు. అది కూడా ఏదో చిన్న గది అనుకుంటే పొరపాటే. సువిశాల ప్రాంగణంలో ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి మరీ ఏర్పాటు చేశారు. మందుబాబులు కూర్చుని తాగేందుకు కుర్చీలు, టేబుళ్లు, వేశారు. వర్షం, ఎండా పడకుండా విశాలమైన షెడ్లు వేసి బయటికి తెలియకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. షెడ్ల లోపల పెద్ద ఫ్లడ్‌లైట్‌లు వేసి మరీ మందు అందజేస్తున్నారు. మంచింగ్ కోసం అన్ని రకాల నాన్ వెజ్ ఆహార పదార్థాలను అక్కడే ఉంచుతున్నారు. ఎంత సేపైనా కూర్చునేందుకు అవకాశం కల్పిస్తుండడంతో మద్యం ప్రియులు ఉదయం నుంచి రాత్రి వరకు అక్కడే తప్ప తాగి తూలుతున్నారు.

డీ ఫార్మసీ కోర్సుల ప్రవేశానికి 19 వరకు గడువు

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి

కడప ఎడ్యుకేషన్ : ఇంటర్మీడియట్ బైపీసీ, ఎంపీసీ పాస్ అయిన విద్యార్థులకు డి ఫార్మసీ కోర్సులో ప్రవేశం కోసం ఈ నెల 19వ తేదీ వరకు గడువు ఉందని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, జిల్లా కో–ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరు కాబోతున్న విద్యార్థులు ప్రాసెసింగ్ రుసుము రూ. 400 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ రుసుంను మీ దగ్గరలోని ఇంటర్‌నెట్ సెంటర్ లేదా ఏపీ ఆన్‌లైన్ ద్వారా గానీ చెల్లించాలని సూచించారు. కౌన్సెలింగ్‌కు హాజరు కాబోతున్న విద్యార్థులు ఈ నెల 19లోపు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని అమె తెలిపారు. మరిన్ని వివరాలకు https://apsbtet.in/pharmacy వెబ్ సైట్ ద్వారా వివరాలను తెలుసుకోవాలని ప్రిన్సిపాల్, కో ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి తెలిపారు.

ఆవుల కుటుంబానికి వైఎస్ జగన్ పరామర్శ


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల


ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డిని పరామర్శిస్తున్న రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి

సంబేపల్లె : వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఆవుల వేణుగోపాల్ రెడ్డి మరణ వార్తను మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి ద్వారా తెలుసుకున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయన కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించారు. సోమవారం ఆవుల కుమారులు ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, ఆయన సోదరుడు ఆవుల మల్లికార్జున రెడ్డిలతో ఫోన్‌లో మాట్లాడి తీవ్ర సంతాపం ప్రకటించారు. అలాగే మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణా రెడ్డిలు కూడా ఫోన్ ద్వారా తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

నివాళులు అర్పించిన ప్రముఖులు..

రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ రెడ్డి, వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా, మాజీ ఎమ్మెల్యేలు గడికోట మోహన్ రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, చింతల రామచంద్రా రెడ్డి, ద్వారక నాథ్ రెడ్డి, లక్ష్మీదేవమ్మ, దేశాయి తిప్పారెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ మదనపల్లె ఇన్‌చార్జ్ నిస్సార్ అహ్మద్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ అహమ్మద్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి, రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డి తదితరులు ఘనంగా నివాళులు అర్పించారు.